# కాముకులు

"బిజిలిదేవి"

స్వయంకృతాపరాధానికి విచారించ నవసరం లేదు; కర్తవ్యం ఆలోచించాలి. అతను యౌవనంలోనున్నపుడు లక్షాధికారి; నిశాచరుడు; నిరక్షరాస్యుడు. అప్పుడు నీవతని ప్రేమభిక్షకోసం యాచించేవు; వివాహప్రయత్నానికి పురికొల్పేవు; నీజీవిత పాత్రను మధుర రసపూరితం చేసుకుందామనుకున్నావు. కారణం: ధనవంతుడనేకదూ!—కొంత వరకు ఫలించినా నీప్రయత్నం చివరకు నిష్ఫలమయింది. నీయౌవనం చవిచూచినవాడు—యిప్పుడో అతడొక దరిద్రుడు; భిక్షుకుడు; యాచకుడు; కాముకుడు; కులహీనుడు; రోగి. నీవో ఆఘ్రాణింపబడిన పుష్పం. ఇదే నాటికి, నేటికి మీలో కలిగిన మార్పు.

'పతి యేవేషంలోనున్నా పసికట్టకలిగేదే పతివ్రతా శిరోమణి యంతరాత్మ.''—నాటి యౌవనం నేటి రోగానికి కారణం. అంతమాత్రాన అతన్ని విసర్జించడం దురాచారం. నాటినుండి నీవొక వ్యభిచారిణిలా లోకానికి కనబడుతున్నావు. చివరకు నీమృతకళేబరాన్ని చితికిజేర వేసేవారుకూడా కనబడరు. ఇది సంఘమర్యాద. పుష్పం నలుగురి చేతిలో పడితే నలిగి వాడిపోయి దాని పరిమళాన్ని గోల్పోతుంది. అంతే నీప్రణయ కుసుమంకూడా, దానికున్న ప్రత్యేకతేమిటి? నీవొక మనీషివా? కాదు—సామాన్య యువతివే. అటువంటప్పుడతనిపై దోషాన్ని ఆరోపించడం నీనేరం. వివాహం కానిదే నీ జీవితపరమావధికతడు బాధ్యుడు కాడు. పసిడి కాంతుల నీమిసిమిజవ్వనాన్నతని కర్పించేవు. అది స్వయంకృతాపరాధం. ఎవరి నడిగి చేశావు ఆపని. తత్ఫలం నీవు తప్పక అనుభవింపవలసిందే. దానికి బాధ్యురాలవు నీవే.

బాధ్యత అంతా నీదే అనడానికికూడా వీలు లేదు.—?—ఒకప్పుడు సోదరసమానుడు నేటి నీవిటుడు. అదే అతనిలోని కాముకత్వం. దీని తత్వమే పగటి సహోదరత్వం. ఈ తత్వవేత్తలు లోకంలో ఎంతమంది లేరు! తెలిసుండికూడా నీవా తత్వబోధకస్వామివద్ద శిష్యత్వం పొందేవు. తప్పెవరిది? ఇప్పుడు నీవొక జీవచ్ఛవం; నీదొక శుష్క జీవితం; ఎండినయెడంద; మొండిప్రాణి—అతడొక పాషాణహృదయుడు; పటుత్వహీనుడు; త్రాగుబోతు; తత్వవేత్త; దురాచార పరాయణుడు; దరిద్రనారాయణుడు.

మిమ్మల్ని యీకళంక జీవితానికి పురికొలిపిందెవరో నాకు తెలుసు. వాడి మీసాలవడి క్షౌరకుడు సమీపించేవరకే. ఇకనదంతా గతజల సేతుబంధనం. ముందు కాబోయేదానికి కర్తవ్యం ఆలోచించాలి. నీకు రెండే గమనపథాలు—అంతఃపుర రాణిలా యింకా నీవెందుకతని ప్రణయసౌధంలో? అతన్ని ప్రేమించకపోతే వెలికివచ్చి ప్రాణం త్యజించు.—?—అతడుకూడా నిన్ను ప్రేమిస్తున్నట్టు కనపడదు. లేదా నీకు కష్టంగావున్నా వివాహం రెండో మార్గం, అతడు యిష్టపడితే.—అవసానదశ, ఆశాలత—యీరెండే నీకుటుంబ కులగౌరవ సౌధాలకు ప్రథమ సోపానాలు. నీకీర్తి ప్రణయసామ్రాజ్యంలో వినీలాకాశంమీద, కారుమబ్బుల నడుమనొక సౌధామినిలా మెఱిసిపోతుంది; ఉషఃకాంతై ప్రవేశిస్తుంది. ప్రేమికులందరూ దానికి ప్రేక్షకులు, ప్రేమికా! యిదే నా యంత్యోపదేశము; తుది నమస్కారము.